దూరవిద్య పీజీ ప్రవేశాల గడువు పొడగింపు

కామారెడ్డి టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయంలో దూరవిద్య పీజీ కోర్సులతో పాటు పీజీ డిప్లొమా కోర్సుల ప్రవేశాల గడువు పొడగించారని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, సమన్వయకర్త సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ, ఎంసీఏ, ఎంఏ, ఎమ్మెస్సీ డిప్లొమా కోర్సులు ఉన్నాయని, 15వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఓయూసీడీఈ.నెట్‌లో చూసుకోవచ్చని తెలిపారు. వివరాలకు సెల్ నెం.9440356276, 9182304067 ద్వారా ఉదయం 11 నుంచి 4 గంటల వరకు సంప్రదించవచ్చని పేర్కొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికలపై.. గురి!



- ఎన్నికలపై దృష్టి సారించిన ప్రధాన రాజకీయ పార్టీలు
- బరిలో దిగేందుకు పలు పార్టీల నేతల ప్రయత్నాలు
- పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి ఆశావహులు సన్నద్ధం
- ఇప్పటికే ప్రచారం ముమ్మరం చేసిన పలువురు నేతలు
- జిల్లాలో ప్రధాన కూడళ్ల వద్ద వెలసిన ఫ్లెక్సీలు
- ఓటరు నమోదుపై ప్రత్యేకదృష్టి
- రేపటితో ముగియనున్న ఓటరు నమోదు ప్రక్రియ
- ఆసక్తి చూపని పట్టభద్రులు

కామారెడ్డి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలపై ఓవైపు ప్రధాన పార్టీలు దృష్టి సారించడమే కాకుండా.. మరోవైపు విద్యా సంస్థల అధినేతలు, వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు పోటీకి సిద్ధమవుతున్నారు. శాసన మండలిలో ఎలాగైనా.. తమ బలాన్ని పెంచుకునేందుకు ప్రధాన పార్టీలు ఈ ఎన్నికలపై దృష్టి సారించాయి. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలను దక్కించుకునేందుకు అధికార కాంగ్రెస్, ప్రతిపక్షాలైన బీజేపీ, బీఆర్ఎస్‌లు భావిస్తున్నాయి. ఇదే సందర్భంలో ఆయా పార్టీల్లోని పలువురు ముఖ్య నేతలు పార్టీ పరంగా బరిలోకి దిగేందుకు పావులు కదుపుతున్నారు. ఇప్పటికే పలువురు ఆశావహులు ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఆయా జిల్లాలో పట్టణ కేంద్రాలతో పాటు ఆయా మండలాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద పోటీ చేయాలనుకునే ఆశావహులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తూ.. ఓటరు నమోదు చేసుకోవాలంటూ ప్రచారం చేసుకుంటున్నారు. అతేకాకుండా ఓటు నమోదుకు ఈనెల 6వ తేదీతో గడువు ముగియనుంది. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటు నమోదు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. అంతేకాకుండా పట్టభద్రులు ఓటు నమోదు చేసుకునేందుకు ఆసక్తి చూపడం లేదని తెలుస్తుంది.


ఎమ్మెల్సీ స్థానాలపై పార్టీల దృష్టి

శాసన మండలిలో తమ బలం పెంచుకునేందుకు ప్రధాన పార్టీలు దృష్టిసారించాయి. ప్రధానంగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్సీ ఎన్నికలపై ఫోకస్ పెట్టినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డి కొనసాగుతున్నారు. ఆయన కాంగ్రెస్ పార్టీ నుంచే గతంలో గెలుపొందారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా రఘోత్తమరెడ్డి ఉన్నారు. వీరి పదవి కాలం మార్చిలో ముగియనుంది. ఆలోపే ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ ఏర్పాట్లు చేస్తోంది. ఇదివరకే ఓటరు నమోదు ప్రక్రియ షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలను ఎలాగైనా దక్కించుకోవాలని భావిస్తోంది. కామారెడ్డి జిల్లాలో ఇటీవల ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటించినప్పుడు ఓ సభలో ఎమ్మెల్సీ స్థానాలను కాంగ్రెస్ గెలుచుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దీంతో కాంగ్రెస్ అధిష్టానం ఈ ఎన్నికలపై దృష్టిసారించినట్లు తెలుస్తుంది. మరోవైపు బీజేపీ సైతం ఎమ్మెల్సీ స్థానాలను గెలుచుకోవాలని ప్రణాళిక వేస్తుంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లోను ఆ పార్టీకి విద్యావేత్తల నుంచి మంచి ఓటు బ్యాంకు లభించడంతో ఈ ఎన్నికల్లో బలమైన అభ్యర్థిని బరిలో దించేందుకు ఆ పార్టీ ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఇక బీఆర్ఎస్ పార్టీకి సైతం ఈ నాలుగు జిల్లాలో బలమైన క్యాడర్ ఉండడంతో పోటీకి సిద్ధమవుతోంది.

పెరుగుతున్న ఆశావహుల సంఖ్య

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం జిల్లాలో హడావుడి మొదలైంది. కరీంనగర్-నిజామాబాద్-మెదక్-ఆదిలాబాద్‌ఉమ్మడి జిల్లాల నుంచి పోటీ చేసేందుకు ఆశావహుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇప్పటికే ఆల్‌ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి పోటీలో ఉండగా.. కామారెడ్డి జిల్లా నుంచి కొందరు ఆశావహులు పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. అదేవిధంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నుంచి పలువురు పోటీలో ఉండేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆయా జిల్లాలో ఆశావహులు పర్యటిస్తూ.. ఈసారి మండలి స్థానంలో పోటీ చేసేందుకు తాము ఉన్నామంటూ.. తమకు ఒక అవకాశం ఇవ్వాలంటూ కళాశాలలు, ఆయా సంఘాల నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారు. ప్రస్తుతం ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతున్నందున పట్టాభద్రులు, ఉపాధ్యాయులు ఓటు నమోదు చేయించేందుకు ప్రచారం చేపడుతున్నారు. అంతేకాకుండా వారి తరపున ప్రత్యేక టీంలను రంగంలోకి దింపి ఓటు నమోదు అయ్యేలా చూస్తున్నారు.

ఆశావహుల ప్రచారం ముమ్మరం



పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇప్పటికే పలువురు ఆశావహులు సిద్ధమయ్యారు. ఆయా జిల్లాలో పర్యటిస్తూ ప్రచారం చేపడుతున్నారు. తమకు ఒకసారి అవకాశం ఇవ్వాలంటూ ఆశావహులు పట్టభద్రులను, ఉపాధ్యాయుల ను కలుస్తూ.. ఓటు అభ్యర్థిస్తున్నారు. ఓటు నమోదు కోసం సోషల్ మీడియా వేదిక ద్వారా ప్రచారం చేపడుతున్నారు. ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆశావహులు తమ వాలంటీర్ల ద్వారా నమోదు ఫారాలను పంపిణీ చేస్తున్నారు. అలాగే కొంతమంది ఆయా జిల్లాలో నేరుగా కార్యాలయాలను ప్రారంభించి దరఖాస్తులను స్వీకరించి సంబంధిత అధికారులకు అందిస్తున్నారు. అదేవిధంగా పట్టాభద్రులు, ఉపాధ్యాయుల సెల్‌ఫోన్ నెంబర్లను సేకరించి ఓటు హక్కు కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగాం, తదితర సోషల్ మీడియా ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ఎస్ఎంఎస్‌లు వాట్సాప్ ద్వారా లింక్‌లు పంపుతున్నారు. సోషల్ మీడియా ద్వారా గ్రూప్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

ముగియనున్న నమోదు ప్రక్రియ



వచ్చే ఏడాది మార్చి చివరిలో జరగనున్న పట్టభద్రుల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు హక్కు నమోదు బుధవారంతో ముగియనుంది. ఓటు నమోదుచేసుకునేందుకు పట్టభద్రులు పెద్దగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తుంది. గతంలో పట్టాభద్రులుగా నమోదు చేసుకున్న ఓటర్లు సైతం మళ్లీ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని చెప్పడంతో కొంతమంది ఓటర్లు సర్టిఫికెట్లు లభ్యం కాక నమోదు చేసుకోలేకపోతున్నారు. అలాగే

(మిగతా 8వ పేజీలో...)



అంతంపల్లి విండో ఎదుట గుమిగూడిన రైతులు

తేమను కొలిచే పరికరంలో తేడా

- ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతుల ఆందోళన

భిక్కనూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతంపల్లి గ్రామంలోని దాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం తేమ శాతాన్ని కొలిచే తమను కొలిచే పరికరంలో తేడా వస్తోందని ఆరోపిస్తూ సోమవారం విండో ఎదుట గ్రామ రైతులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్లితే.. దాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతుల ధాన్యం తేమ శాతాన్ని కొలిచే సమయంలో ఒక విధంగా రైస్ మిల్లులో కొలిచిన సమయంలో ఒక విధంగా తేమ వాతం వస్తుందని, ధాన్యం కొలిచే మిషన్‌లో సైతం కొంత తేడా వస్తోందని.. ఇలాగైతే తాము ఎంతగానో నష్ట పోతున్నామన్నారు. రైతులు నష్టపోతుంటే మీరేమి చేస్తున్నారని సీఈవో శ్రీనివాస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే విషయం తెలుసుకున్న విండో ఛైర్మన్ వెంకట్ రెడ్డి అక్కడికి చేరుకుని తేమ మిషన్లు మార్కెట్ కమిటీ వారిచ్చినవే అని, అందులో ఎలాంటి అవకతవకలకు పాల్పడటానికి వీలుండదని, కాంటాలను సైతం జిల్లా కొలతలు, తూనికల అధికారులు కొనుగోలు కేంద్రం ప్రారంభానికి ముందే పరిశీలించి సరిచేశారని అన్నారు. తేమ మిషన్ పాతది కావడం తో మిషన్ లో ఏమైనా సమస్య ఉండి ఉండవచ్చునని, వాటి స్థానంలో కొత్త తేమ కొలిచే మిషన్లను వెంటనే ఏర్పాటు చేయ డం జరుగుతుందన్నారు. కాగా ఏడీఏ అపర్ణ, ఏవో రాధ చేరుకుని రైతులను సముదాయించి సమీపంలోని రైస్‌మిల్లుకు రైతులను తీసుకెళ్లి రైస్‌మిల్, విండోలోని రెండింటి తేమ మిషన్‌లలో ధాన్యాన్ని వేసి పరిశీలించగా రెండింటిలో ఒకేవిధంగా వచ్చింది. దీంతో రైతులు ఆందోళనను విరమించారు.

నెరవేరిన గురుకుల విద్యార్థుల కల!

- జిల్లాలోని గురుకులాలు, వసతి గృహాల్లో పుష్టికర భోజనం
- మెస్, కాస్మోటిక్ ఛార్జీల పెంపకంపై విద్యార్థుల హర్షం
- గురుకులాల మెస్, బాలికల కాస్మోటిక్ ఛార్జీలు పెంచిన ప్రభుత్వం
- ఏడేళ్ల తర్వాత పెరిగిన ఆహార ఛార్జీలు
- ఈనెల నుంచే అమలుకు ఆదేశాలు

ఎల్లారెడ్డి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా మెస్, కాస్మోటిక్ ఛార్జీల పెంపు కోసం ఎదురు చూస్తున్న విద్యార్థుల కల నెరవేరింది. చాలీచాలని ఛార్జీలతో వసతి గృహాలు, గురుకులాలు నెట్టుకొస్తున్న నిర్వాహకులను దృష్టిలో ఉంచుకున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఇటీవల ఛార్జీలు పెంచుతున్నట్లు ప్రకటించింది. దీపావళి పర్వదినంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. 2017లో చివరిసారిగా మెస్ ఛార్జీలను పెంచిన ప్రభుత్వం ఆ తరువాత పట్టించుకోలేదు. కాస్మోటిక్ ఛార్జీలు సైతం పెంచలేదు. ఛార్జీలు పెంచాలని విద్యార్థి సంఘాలు జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాల కేంద్రాలు ధర్నాలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అయినప్పటికీ అప్పటి ప్రభుత్వం వారి వినతులను పట్టించుకోలేదు. ఫలితంగా నిర్వాహకులు అరకొర ఛార్జీలతోనే నెట్టుకొచ్చారు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన బలవర్థమైన ఆహారం లభించేది కాదు. కానీ ఇటీవల రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల కనికరం చూపించిందంటున్నారు.

తల్లిదండ్రులకు తగ్గిన ఆర్థిక భారం

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కాస్మోటిక్ మెస్ ఛార్జీలను పెంచుతూ నిర్ణయం తీసుకోవడంతో తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గింది. ఇప్పటి వరకు బాలురకు రూ.62 చొప్పున బాలికలకు మూడు నఉంచి 5వ తగతి వారికి రూ.55 చొప్పున కాస్మోటిక్ ఛార్జీలు అందించేది. వీటితో తలకు నూనె, మొఖానికి పౌడర్, సబ్బులు, టూత్‌పేస్ట్, బ్రష్, శానిటరీ నాప్కిన్స్ ప్రతినెల కొనుగోలు చేయాల్సి రావడంతో రూ.200 వరకు ఖర్చు అయ్యేది. ఫలితంగా తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడేది. ఈ నేపథ్యంలో 16 సంవత్సరాల తరువాత ప్రభుత్వం కాస్మోటిక్ ఛార్జీలను మూడు రేట్లు పెంచుతూ నిర్ణయం తీసుకోవడంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు ఊరట లభించినట్లు అయింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలతో పాటు గురుకులాలు, కేజీబీవీ పాఠశాలలో సుమారు 18 వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అంతేకాకుండా పెరిగిన కాస్మోటిక్ మెస్ ఛార్జీలతో వీరందరికీ ప్రయోజనం చేకూరాలని ఉంది. పెరిగిన ఛార్జీలు ఈనెల ఒకటిన ఉంచి అమల్లోకి వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది.

గురుకులాలు, వసతి గృహాల్లో కాస్మోటిక్ ఛార్జీల వివరాలిలా..

కేటాగిరి	ప్రస్తుత ఛార్జీలు రూపాయల్లో	పెరిగిన ఛార్జీలు
3-7 తరగతి బాలికలకు	55	175
పదో తరగతి 11ఏళ్ల పైబడిన బాలికలకు	75	275
3-7వ తరగతి బాలురు	62	150
పదో తరగతి 11 ఏళ్ల పైబడిన బాలురకు	62	200
మెస్ చార్జీల వివరాలు		
3 నుంచి 7వ తరగతి	950	1330
8 నుంచి పదో తరగతి	1100	1540
ఇంటర్ నుంచి పీజీ	1500	2100



ఎల్లారెడ్డి గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో సీఎం ఫొటో ప్లకార్డులతో ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు



ఎల్లారెడ్డి గిరిజన గురుకులంలో భోజనం చేస్తున్న విద్యార్థినులు

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి : కలెక్టర్

- జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్
- గర్గుల్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన
- కేంద్రాల్లో రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశం
- 'ప్రజావాణి' దరఖాస్తుల స్వీకరణ

కామారెడ్డి టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కామారెడ్డి మండలంలోని గర్గుల్ గ్రామంలో గల ధాన్యం కొనుగోలు కేం ద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొనుగోళ్ల వేగవంతం చేయాలని, అదనంగా హమాలీలను నియమించుకోవాలని అన్నారు. వరిధాన్యంలో చెత్తలేకుండా జల్లెడ పెట్టాలని తెలిపారు. కొనుగోలు చేసే ముందుకు దాన్యం తేమశాతం కొలవాలని తెలిపారు. ధాన్యం తూకంలో ఎలాంటి వ్యత్యాసం రాకుండా ప్రతీ బస్తా 40.600 కిలోల తూకం వేయాలని అన్నారు. తూకం వేసిన బస్తాలను లారీల్లో నింపి కేటాయించిన రైస్‌మిల్లులకు తరలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథ్‌రావు, పౌర సరాఫరాల జిల్లా మేనేజర్ రాజేందర్, ఇన్‌చార్జి జిల్లా పౌరసరాల అధికారి నరసింహరావు, జిల్లా అధికారి రామ్మెహన్, తహసీల్దార్ జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.



గర్గుల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

మౌలిక సదుపాయాలు కల్పించాలి

కామారెడ్డి టౌన్(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, రైతులకు అందుబాటులో ప్యాడి క్లినర్స్ తదితర ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 423 దాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, అన్ని కేంద్రాల్లో రైతులు కనీస సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ప్రతీ కేంద్రంలో ప్యాడి క్లినర్స్, టార్పాలిన్స్, తూకం మిషన్‌లు, తదితర సౌకర్యాలు కల్పించాలని అన్నారు. సన్నవడ్లు, దొడ్డు వడ్లు విడివిడిగా కొనుగోళ్ల చేయాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యంను లారీల్లో టాగింగ్ చేసిన రైస్‌మిల్లులకు తరలించాలని అన్నారు. సీఎంఆర్ చేయని రైస్ మిల్లర్లపై చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఉన్న హార్వేస్టర్స్‌తో పంటలు కోత చేసే సమయంలో డ్రైవర్స్‌కు పలు సూచనలు చేయాలని తెలిపారు. జిల్లాలో పత్తికొనుగోళ్ల ప్రారంభించాలని మార్కెటింగ్ అధికారిణి ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.విక్టర్, పౌర సరాఫరాల శాఖ జిల్లా మేనేజర్ రాజేందర్, ఇన్‌చార్జి జిల్లా పౌరసరాఫరాల అధికారి నరసింహరావు, డీఆర్డీఏ పీడీ సురేందర్, డీఏవో తిరుమలప్రసాద్, మార్కెటింగ్ అధికారిణి రమ్య, సహకార అధికారి రాంమెహన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులపై సత్వర చర్యలు

కామారెడ్డి టౌన్(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలు వారి సమస్యలపై ప్రజావాణిలో సమర్పించే అర్జీలను పరిశీలించి వారి పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని, తన పరిధిలో లేని సమస్యలపై ఉన్నతాధికారులకు విన్నవించాలని సూచించారు. మొత్తం 67 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఇంటింటి సర్వే ఈనెల 6 నుంచి ప్రారంభించడం జరుగుతుందని, ఎన్యూమరేటర్‌లకు పవార్ పాయింట్ ద్వారా మండల స్థాయిలో శిక్షణ నిర్వహించాలని తెలిపారు. 10 శాతం మందిని అదనంగా ఎన్యుమరేటర్‌లను నియమించుకోవాలని తెలిపారు. సర్వేచేసేందుకు కావాల్సిన స్టేషనరీ సామగ్రి సమకుర్చాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కార్యక్రమంలో భాగంగా ప్రతీ మండలంలో మాడల్ ఇళ్లు నిర్మాంచాలని తెలిపారు. వరి ధాన్యం సేకరణలో భాగంగా మండల, డివిజన్ స్థాయి కమిటీలను ఏర్పాటుచేయాలని తెలిపారు. తహసీల్దార్, నయబ్ తహసీల్దార్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌లు ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలని తెలిపారు. ధాన్యం తేమశాతం, తూకం, ధాన్యం రవాణా, తదితర అంశాలను పరిశీలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు శ్రీనివాస్‌రెడ్డి, వి.విక్టర్, ఆర్డీవో రంగనాథ్‌రావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



లింగంపేట రామేశ్వర ఆలయంలో సహస్ర కార్తిక దీపోత్సవం

శివాలయాలకు కార్తీక శోభ

- జిల్లాలోని ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక పూజలు

8

పశువుల పాకగా డబుల్ ఇళ్లు!

- నాగిరెడ్డిపేటలో ఏడేళ్లుగా పూర్తి కాని డబుల్ బెడ్‌రూం నిర్మాణ పనులు
- పనుల పూర్తిలో అధికారుల నిర్లక్ష్యం
- పేదలకు కలగానే మిగిలిన సొంతిల్లు



వివరాలు 7లో...

మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి



జక్రాన్‌పల్లిలో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మహిళలకు అన్ని సంక్షేమ పథకాలు అందించిన వారిని అభివృద్ధి చేసి లక్షాధికారులనే కాకుండా కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. సోమవారం జక్రాన్‌పల్లిలో కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు సుమారు రూ.కోటి 40లక్షల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రైతులుక అన్ని సంక్షేమ పథకాలు అందించి త్వరలో మహిళలకు రూ.లక్ష కోట్ల వడ్డీలేని రుణాలను అందిస్తామన్నారు. ఈ నెల 6నుంచి అన్ని గ్రామాల్లో కులగణన సర్వే జరుగుతుందని, ఈ సర్వేకు ప్రజలు అధికారులకు సహకరించాలన్నారు. ఈ కులగణన సర్వేతో అన్ని వర్గాల కులాలకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఎం.సాయిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిన్నారెడ్డి, సింగిల్‌విండోల చైర్మన్‌లు ఆర్మూర్ గంగారెడ్డి, కాట్‌పల్లి నర్సారెడ్డి, మండల ప్రధానకార్యదర్శి వసంత్‌రావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు వినోద్; ఆర్మూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కనక రవి, మాజీఎంపీపీ అప్పాల పెద్ద రాజన్న, మాజీసర్పంచ్‌లు ఎం.చిన్న సాయిరెడ్డి, కాట్‌పల్లి నర్సారెడ్డి, బాలకిషన్, మాజీఎంపీటీసీలు రూపాల గంగారెడ్డి, మండల ప్రత్యేక అధికారి ప్రవీణ్, తహసీల్దార్ కిరణ్మయి. ఎంపీడీవో సతీష్‌కుమార్, వ్యవసాయాధికారిణి దేవిక, ఎంఈవో శ్రీనివాస్, ఎంపీవో యూసుఫ్‌ఖాన్, ఆర్ఐ ప్రవీన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లకు నియామక పత్రాల అందజేత

ఆర్మూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లుగా మండలంలోని తొర్లికొండ, గన్యా తండా గ్రామాలకు చెందిన కనక రవి, పీర్‌సింగ్‌లు నియమితులయ్యారు. సోమవారం జక్రాన్‌పల్లిలో మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు కనక రవి, పీర్ సింగ్‌కు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి నియమక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీడీసీఎంఎస్ చైర్మన్ ఎం.సాయిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిన్నారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్‌లు ఆర్మూర్ గంగారెడ్డి, కాట్‌పల్లి నర్సారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీఎంపీపీ అప్పాల పెద్ద రాజన్న, మాజీసర్పంచ్‌లు శ్రీపతి శేఖర్, కాట్‌పల్లి నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అన్ని రకాల సేవలు అందిస్తాం

తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్‌పర్సన్ శోభ

మోర్తాడ్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలకు అన్ని రకాల సేవలను తెలంగాణ గ్రామీణ బ్యాంకు ద్వారా సేవలను అందిస్తామని తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్‌పర్సన్ వై.శోభ అన్నారు. సోమవారం మోర్తాడ్ మండల కేంద్రంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు శాఖను ఆమె ప్రారంభించారు. తొలుత జ్యోతి ప్రజ్వాలన చేశారు. అనంతరం బ్యాంకులోని మేనేజర్, క్యాష్‌కౌంటర్‌ను ప్రారంభించారు. అనంతరం ఆహూతులతో మాట్లాడుతూ గ్రామీణ యువత ఉపాధి కోసం రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. పరిశ్రమను ఇతర ఉపాధి, వ్యాపార రంగాలకు కోటి రూపాయల వరకు రుణం అందిస్తామని, మా బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని కోరారు. రిజినల్ మేనేజర్ డీవీఎస్.రామారావు మాట్లాడుతూ బ్యాంకు శాఖకు మీ కోసం ఏర్పాటు చేశా మని బ్యాంకు ద్వారా సేవలు పొంది బ్యాంకును అభివృద్ధి దిశలోకి రావడానికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ కె.నరేందర్, అభినయ్‌రెడ్డి, అనిల్‌కుమార్, సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బోగ ధరణి ఆనంద్, సత్యనారాయణ, జక్కుల అశోక్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు 436వ శాఖను తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్‌పర్సన్ వై.శోభ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ వై.శోభ మాట్లాడుతూ కేవలం ఒక జిల్లాకే పరిమితమైన గ్రామీణ బ్యాంకు నేడు రాష్ట్ర వ్యాప్త బ్యాంకుగా విస్తరించిందన్నారు. ఈ కార్యక్రమంలో వీడీసీచైర్మన్ నారాయణ, రాజ్‌కుమార్, నిర్మల్ రిజియన్ ఆర్ఎం డీవీఎస్ రామారావు, ఎస్ఎంవో అభినయ్‌రెడ్డి, అడ్వాన్సెస్ మేనేజర్ నగేందర్‌రెడ్డి, సుధీర్, సురేందర్‌రెడ్డి, నవీన్, రవీందర్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

హెగ్డోలిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కోటగిరి,నవంబరు4(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని హెగ్డోలి, హంగర్గ ఫారం గ్రామాలలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను కోటగిరి ఏఎంసీ చైర్మన్ హన్మంతు ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధరతో పాటు బోనస్ ధరను అందిస్తుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మోతెలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఏఎంసీ చైర్మన్

వేల్పూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోతె గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నం దాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం సొసైటీ చైర్మన్ మోతె రాజేశ్వర్‌తో కలిసి వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో సౌకర్యాల గురించి అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి కృష్ణ, సీఈవో, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపల్లిలో ..

కోటగిరి,నవంబరు4(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలంలోని కొత్తపల్లి సహకార సంఘం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం కోటగిరి తహసీల్దార్ గంగాధర్ సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకంను పరిశీలించారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సేకరించిన ధాన్యాన్ని సంబంధిత రైస్‌మిల్లులకు తరలిస్తున్నామని ఆయన తెలిపారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

రెంజల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం చిన్నయ్య అన్నారు. సోమవారం మండలంలోని దండిగుట్ట, బాగేపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని దళారుల పాలు చేయకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలన్నారు. రైతులకు ప్రభుత్వం మద్దతు ధరతో పాటు బోనస్‌ను అందిస్తుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీలు భాస్కర్, శివ, సీఏ వరలక్ష్మి పాల్గొన్నారు.

ఎలాంటి ఉద్రిక్త పరిస్థితి లేదు: సీఐ రవీందర్

లింగంపేట, నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లోని జంబి హనుమాన్ ఆలయం వద్ద ఫ్లెక్సీ కాల్చి వేశారని దాంతో మండల కేంద్రంలో ఉద్రిక్త పరిస్థితులు ఉన్నాయని సోషల్ మీడీయాలోను, కొన్ని మీడియాల్లోను వచ్చిన వార్తల్లో ఎలాంటి వాస్తం లేదని మండల కేంద్రంలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు లేవని సీఐ రవీందర్ అన్నారు. ఆయన సోమవారం ఆలయం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆలయం వద్ద ఫేక్సీ కాల్చివేతపై విచారణ జరుపుతున్నామని ఇంత వరకు ఎలాంటి పిర్యాదు కాని, ఎలాంటి సమస్యలు కాని రాలేదని దానిపై కొందరు సోషల్ మీడియా లో ఉద్రిక్త పరిస్థితులు అంటు పోస్టులు పెట్టడం జరిగిందని, కొన్ని ఆన్‌లైన్ పత్రికలలోను, ఇతర పత్రికలలోను ఇక్కడ ఏమి జరగకపోయినా జరిగినట్లు ఊహించి వార్తలు రాస్తున్నారని అలాంటి వారిపై చట్టరిత్య చర్యలు తీసుకుంటామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై ప్రకాశ్, కానిస్టేబుల్స్ విశ్వహిందూ పరిషత్ నాయకులు శివయ్య, మురళి ఉన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



ఏకచక్రేశ్వరాలయంలో దీపోత్సవం వేద పండితులు



సిద్దులగుట్టపై పల్లకిసేవలో పాల్గొన్న భక్తులు

బోధన్‌రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వర శివాలయంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయంలో భక్తులు కార్తీక మాస పూజలు నిర్వహించారు. ఉసిరి కాయలపై దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. వేద పండితులు గణేష్ మహరాజ్, సంతోష్ మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బోధన్ చక్రేశ్వరాలయంలో దీపోత్సవం

బోధన్‌రూరల్: బోధన్ పట్టణంలో ఏకచక్రేశ్వరాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సోమవారం దీపోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. వేద పండితులు గణేష్ మహరాజ్ మంత్రోశ్చరణల మధ్య దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పాలెంలో లక్ష గాజుల అర్చన

మోర్తాడ్: మండలంలోని పాలెం గ్రామానికి చెందిన వేదపండితులు, గ్రామ పురోహితులు సహసం రంజిత్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో సోమ వారం కోటి దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమ్మవారికి లక్ష గాజులతో అర్చన చేయించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు రంజిత్ శర్మతో పాటు భక్తులు పాల్గొన్నారు.

సిద్దులగుట్టపై ప్రత్యేక పూజలు

పెర్కిట్: కార్తిక మాసం మొదటి సోమవారం పుష్కరించుకొని పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై మహిళలు పిండి ప్రమీదలతో దీపాలు వెలిగించి ఆలయ పూజరి కుమార్‌శర్మకు దానం చేశారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో పల్లకిసేవ ఘనంగా నిర్వహించారు. ఆర్మూర్‌కు చెందిన రమేష్ లక్ష్మీల కుమారుడు నితిన్ భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ.గంగారెడ్డి, మల్లయ్య, కొంతం మురళీ, నరేష్, రామాగౌడ్, సిద్దులగుట్ట సేవ సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పలువురు మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు



ఆర్మూర్ మాజీసర్పంచ్‌లకు మద్దతు తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు



నవీపేటలో



జక్రాన్‌పల్లిలో ..

నవీపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన పలువురు మాజీ సర్పంచ్‌లను సోమవారం ఉదయం ముందస్తుగా అరెస్టు చేసినట్లు ఏఎస్ఐ గఫర్ తెలిపారు. పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని కోరుతూ సోమవారం మాజీ సర్పంచ్‌లు చేపట్టిన ఛలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొనకుండా ముందు జాగ్రత్తగా పలువురు మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేసి వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ముందస్తుగా అరెస్టు అయిన వారిలో రాంపూర్ మాజీ సర్పంచ్ రుతు కల్పన, ఫత్తేనగర్ మాజీ సర్పంచ్ ఆసిఫా ఖాతూన్, నందిగామ మాజీ సర్పంచ్ కోస్లీ లావణ్యలు ఉన్నారని అన్నారు. అలాగే పలువురు మాజీ సర్పంచ్‌లను గృహ నిర్బంధనం ఉంచడం జరిగిందన్నారు.

మోర్తాడ్: మండలంలోని బీఆర్‌ఎస్ మాజీ సర్పంచ్‌లు కడారి శ్రీనివాస్, గడ్డం చిన్నారెడ్డి, వెల్మ రవీంధర్, బోగ ఆనంద్, పాలెం సంతోష్‌రెడ్డి, గాండ్లపేట సుమన్ ఎస్సై విక్రం అరెస్టు చేశారు.

జక్రాన్‌పల్లి: మండలంలో మాజీ సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ నాయకులు భోజన్న, మాజీ ఎంపీపీ దీకొండ హరిత శ్రీనివాస్, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌ఖాన్, పడకల్, బ్రహ్మణ్‌పల్లి మాజీ సర్పంచ్ అప్పాల శ్రీనివాస్, లత దేవరాజ్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

కమ్మర్‌పలి: మండలానికి చెందిన కమ్మర్‌పల్లి, చౌట్‌పల్లి సర్పంచ్ లు గడ్డం స్వామి, మారుశంకర్‌తో పాటు ఉప్లూర్, అర్‌ఆర్‌నగర్, హసాకొత్తూర్ గ్రామాల సర్పంచ్ భర్తలు బద్దం చిన్నారెడ్డి, సదాశివ్ గౌడ్, ఏనుగు రాజేశ్వర్‌లను అరెస్టుచేసి మధ్యాహ్నం సొంత పూచికత్తుపై విడుదలచేసినట్లు కమ్మర్‌పల్లి ఎస్ఐ అనీల్‌రెడ్డి తెలిపారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో మాజీ సర్పంచ్‌లను సోమవారం ముందస్తు అరెస్టు చేశారు. ఆలూర్ మాజీసర్పంచ్ కల్లెం మోహన్‌రెడ్డి, రాంపూర్ మాజీ సర్పంచ్ గంజి నర్సయ్యను ముందస్తుగా అరెస్టు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

వేల్పూర్: మాజీసర్పంచ్‌లను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడం పట్ల వేల్పూర్‌ల మండల మాజీసర్పంచ్‌ల ఫోరం తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జైడి నాగాధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బాల్కొండలో

ముప్కాల్: మాజీసర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని తలపెట్టిన చలో హైదరాబాద్ ముట్టడికి తరలివెళ్ళకుండా సోమవారం ఉదయం మండలంలోని ఆయా గ్రామాల మాజీసర్పంచ్‌లను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఐదేళ్ళుగా గ్రామాభివృద్ధికి అభివృద్ధి పనులు చేపట్టిన మాజీసర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ముప్కాల్ మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి మాజీ సర్పంచ్‌ల శాంతియుత నిరసన ప్రద ర్శనకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్‌లు ఆకుల రాజారెడ్డి, ఆర్‌ఐ విష్ణు, మట్ట సందీప్ పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: ప్రజలకోసం చేసిన పనుల బకాయిలు చెల్లించాలని కోరడం తప్పుగా భావించిన కాంగ్రెస్ ప్రభుత్వం దొంగలమాదరి తెల్లవారుజామున ఇండ్లపై దాడులు చేసి సర్పంచ్‌లను వారిభర్తలను అరెస్టులు చేయడం ప్రజాపాలనకు విరుద్ధమని కమ్మర్‌పల్లి మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రేగుంట దేవేందర్ ప్రభుత్వ చర్యల్ని ఖండించారు. పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడతూ తాము అధికారంలోకి వస్తే సర్పంచ్ గ్రామాలలో చేపట్టిన పనులకు బిల్లులు చెల్లిస్తామని డంబకాలు పలికిన సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా నయా పైస చెల్లించలేదని పైగా బిల్లులు అడిగితే అక్రమంగా అరెస్టులు చేయించడం హేయమైన చర్యలను నిదర్శనమన్నారు.

బిఆర్‌ఎస్ నాయకుల మద్దతు

ఏర్గట్ల: పెండింగ్ బిల్లులపై హైదరాబాద్ ధర్నాకు వెళ్ళకుండా ముందస్తుగా మాజీ సర్పంచ్‌లను సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారికి బిఆర్‌ఎస్ నాయకులు మాజీ ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి, బిఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎనుగందుల రాజా పూర్ణానందంలు మద్ధతు తెలిపి కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పత్తిరెడ్డి ప్రకాష్ రెడ్డి, భీమనాతి భాను ప్రసాద్, బాలాజీ గౌడ్, కట్కం సాగర్ పాల్గొన్నారు.

తాజా మాజీ సర్పంచ్‌ల అరెస్టు సరికాదు

బోధన్‌రూరల్: తమ సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లో తలపెట్టిన నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా తాజామాజీ సర్పంచ్‌లను ఎక్కడికక్కడ, ఇళ్ల వద్దనే పోలీసులు అరెస్టు చేయడం సరికాదని తాజామాజీ సర్పంచ్‌లు అన్నారు. సోమవారం తాజామాజీ సర్పంచ్‌ల నిరసన కార్యక్రమంలో భాగంగా బోధన్, సాలూర ఉమ్మడి మండలంలోని తాజా మాజీ సర్పంచ్‌లను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం అర్ధరాత్రి నుండే సర్పంచ్‌లను అరెస్టు చేసి బోధన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత గ్రామ పంచాయతీలు అధ్వానంగా మారాయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్టు అయిన వారిలో కుమ్మన్‌పల్లి సర్పంచ్ గంగాధర్, ఖాజాపూర్ సర్పంచ్ నాగయ్య, కల్దుర్కి సర్పంచ్ నానా పటేల్, బర్దీపూర్ సర్పంచ్ సాయిరెడ్డి ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఉన్నారు.

ముందస్తు అరెస్టు హేయమైన చర్య

బాల్కొండ ఎమ్మెల్యే వేముల

ఆర్మూర్‌రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మా జీ సర్పంచ్‌లను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడం హేయమైన చర్య అని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. తమ హయాంలో అప్పులు చేసి చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులను అడిగితే అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమన్నారు. బిల్లులు చెల్లించకుండా సర్పంచ్‌లను ప్రభుత్వం వేధిస్తోందని మండిపడ్డారు.

అప్రజాస్వామికం : మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్: తమకు రావల్సిన పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ పోరుబాటకు పిలుపునిచ్చిన మాజీసర్పంచ్‌లను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. ప్రజా ప్రతినిధులుగా ఊరికి సేవలు చేసిన మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలన అని ఆయన ప్రశ్నించారు. పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని, అక్రమంగా నిర్బంధించిన మాజీ సర్పంచ్‌లను విడుదల చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు పడకల్ విద్యార్థి ఎంపిక



బాదవత్ కైలాస్

జక్రాన్‌పల్లి, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి 28వ ఎస్‌జీఎఫ్ అండర్-17 వాలీబాల్ పోటీలకు మండలంలోని పకడల్ గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి బాదవత్ కైలాస్ ఎంపికైన ట్టు వ్యాయామ ఉపాధ్యాయుడు గడ్డం శ్రీనివాస్ తెలిపారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో బరెలీలో ఈనెల 6నుంచి 9వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో బదావత్ కైలాస్ పాల్గొంటారని తెలిపారు. గోదావరి ఖనీ జిల్లాలో గత నెల 28నుంచి 30వ తేదీ వరకు జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో బాదవత్ కైలాస్ ప్రతిభ కనబర్చారని, దీంతో జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు మగ్గిడి విద్యార్థినుల ఎంపిక

ఆర్మూర్‌రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండల మగ్గిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు జాతీయస్థాయి అండర్ -17 ఎస్‌జీఎఫ్ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయురాలు హరిత, వ్యాయమ ఉపాధ్యాయుడు మధు తెలిపారు. ఇటీవల గోదావరిఖనిలో జరిగిన రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన హిమతేజ, శ్రీనిధి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి ఉత్తరప్రదేశ్‌లోని బరెలీలో జరగనున్న ఎస్‌జీఎఫ్ అండర్-17 జాతీయస్థాయి వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యా ర్థులను ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

నివాస గృహాల మధ్య ఉన్న రైస్‌మిల్లును తరలించాలి

తహసీల్దార్‌కు బాధిత కుటుంబసభ్యుల వినతి

కమ్మర్‌పల్లి, నవంబర్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్లూర్ గ్రామంలో నివాస గృహాలమధ్య కొనసాగుతున్న హరిజాకృష్ణ రైస్‌మిల్లును నివాసగృహాలకు దూరంగా తరలించాలని గ్రామానికి చెందిన కొందరు బాధిత కుటంబాల సభ్యులు సోమవారం మండల తహసీల్దార్ ఎం అంజేయులకు వినతి పత్రం అందజేశారు. 8-62 నెంబర్‌గల షెడ్డులో ఎండు టన్నుల కెపాసిటీ కలిగిన రైస్‌మిల్లు నివాస గృహాల మధ్య కొనసాగిస్తున్నారని ఈ కారనంగా దుమ్మూధూళి తదతర సమస్యలతో చుట్టుఉన్న నివాస గృహల ప్రజలు ప్రతీరోజు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని, అనారోగ్యం పాలవుతున్నారని పేర్కొన్నారు. గతంలో పలుమార్లు పిర్యాదు చేసినా ఎవరు పట్టించుకోవడం లేదని అవేదన వ్యక్త చేశారు. ఇప్పటికైనా అధికారుల స్పందించి రైస్‌ఇల్లును నివాసగృహాలకు దూరంగా ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బాధిత కుటబాల పక్షాన వినతిపత్రం అందజేసిన వారిలో పోతు గణేష్, జిందం రమేష్, తక్కూరి లింగన్న ఉన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

కమ్మర్‌పల్లి, నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెట్టనున్న సామాజిక, ఆర్థిక, విద్యా ఉపాది సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను ఎన్యూమనేటర్లు పకడ్బందిగా చేపట్టాలని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజా శ్రీనివాస్ అన్నారు. సోమవారం కమ్మర్‌పల్లి మండలపరిషత్ కార్యలయంలో మడలంలో ఎంపికైన ఎన్యూమనేటర్లుకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.సర్వేలో ఏలాంటి తప్పులుదోర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎంపిక చేసిన టీం సభ్యులు ప్రత ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు, తదిరత అంశాలను నమోదుచేయాలన్నారు. శిక్షణ కార్యక్రమలో తహసీల్దార్ ఎం అంజనేయులు, ఎంఈవో ఆంధ్రయ్య, ఎంపీవో సదాశివ్, ఐసీడీఎస్ సూర్‌వైజర్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడి టీచర్లు, వివోఏలు, ఐకేపి తదితర సిబ్బంది పాల్గొన్నారు.



బస్సును ప్రారంభిస్తున్న ఆర్టీసీ డీఎం

బోధన్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బస్సు ప్రారంభం

బోధన్‌రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బోధన్ నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్టుకు సోమవారం ప్రత్యేక బస్సును బోధన్ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధన్ నుండి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం తరపున బస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బోధన్ నుండి బాన్సువాడ, మెదక్, జేబీఎస్, మెహందీపట్నం మీదుగా సూపర్ లగ్జరీ సర్వీస్ ప్రారంభించడం జరిగిందన్నారు.ఈ సర్వీస్ ప్రతీ రోజు సాయంత్రం 5:30గంటలకు బయల్దేరి రాత్రి 12గంటలకు శంషాబాద్ చేరుకుంటుందన్నారు. అలాగే శంషాబాద్ నుండి ఉదయం 5:10గంటలకు బయల్దేరి 11:30 గంటలకు బోధన్‌కు చేరుకుంటుందన్నారు. ఎయిర్‌పోర్టు వెళ్లే బోధన్, బాన్సువాడ, మెదక్ పట్టణ, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే రెండవ పామూరు సర్వీసు కూడా ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ బస్సు మధ్యాహ్నం 3:45గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 6:15గంటలకు చేరుకొని పామూరు నుండి సాయంత్రం 7గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8:45గంటలకు బోధన్‌కు చేరుకుంటుందన్నారు. ఈ అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

నవీపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వాగ్రి సురేష్ (46) అదే రోజు అర్ధరాత్రి మృతి చెందాడని ఏఎస్ఐ మోహన్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నవీపేటలోని శివాజీనగర్‌కు చెందిన వాగ్రి సురేష్ తన భార్య సీతతో కలిసి బైక్‌పై మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా నుండి రాంపూర్ వెళ్లే రోడ్డు వైపు బైక్‌ను మలుపగా వెనుక నుండి వచ్చిన బైక్ ముందు ఉన్న బైక్‌ను ఢీకొట్టడంతో సురేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయని అన్నారు. వెంటనే అతనిని నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడని ఏఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య సీత, సోని, రూప అనే ఇద్దరు కూతుళ్లు ఉన్నారని, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

మాక్లూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మాక్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముల్లంగి గ్రామానికి చెందిన గంగామణి(52) ఊరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. భార్యభర్తల గొడవల కారణంగానే గంగామణి మనస్థాపం చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందని ఎస్సై తెలిపారు. మృతురాలి భర్త గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

ఎడపల్లిలో పేకాట రాయుళ్ల అరెస్టు

ఎడపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎడపల్లి మండల పరిధిలోని వడ్డాపల్లి, ఏఆర్పీ క్యాంపు, బ్రాహ్మణ్‌పల్లి, కుర్నాపల్లి గ్రామాలలో పేకాట ఆడుతున్న 21 మంది మీద 5 కేసులు నమోదు చాశామని వారి వద్ద నుంచి రూ. 14300 లను స్వాధీనం చేసుకుని కోర్టులో డిపాజిట్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధురాలి అదృశ్యం

ఎడపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకంపేట గ్రామానికి చెందిన వృద్ధురాలు అదృశ్యమైనట్టు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గత నెల 11వ తేదీన జానకంపేట గ్రామానికి చెందిన వంకడి లాలూబాయి (72) అనే వృద్ధురాలు బయటికి వెళ్లి తిరిగి రాలేదని చుట్టాల ఇంటికి వెళ్ళిందేమో అనుకున్నామని మూడు రోజుల వరకు ఇంటికి తిరిగి రాకపోయేసరికి బంధువులను, చుట్టు ప్రక్కల వెతికినా దొరకక పోయేసరికి సామవారం వృద్ధురాలి కూతురు వంకడి లక్ష్మి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అదృశ్యమైన వృద్ధురాలి మృతదేహం లభ్యం

నవీపేట, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోకన్‌పల్లికి చెందిన టేకు ముత్తెమ్మ(85)అనే వృద్ధురాలి మృతదేహం సోమవారం గ్రామ శివారులోని వరిపంట పొలంలో లభ్యమైందని ఏఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. టేకు ముత్తెమ్మకు గత కొంతకాలంగా మతిస్థిమితం లేదని గత నెల 26న బయటకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి చేరుకోలేదని ఈ విషయంపై గత నెల 28న నవీపేట పోలీస్ స్టేషన్‌లో అదృశ్యం కేసు నమోదు అయిందని ఆయన పేర్కొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

ముప్కాల్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన తడూరి లింబాద్రి (58) గురువారం రాత్రి గుండెపోటుతో మరణించినట్టు స్థానికులు తెలిపారు. ఉపాధి కోసం 30 ఏళ్లగా దోహ కత్తార్‌కు వెళ్తుండేవాడు. అక్కడ హౌజ్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న లింబాద్రి మార్కెట్‌కు వెళ్ళి వచ్చి ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో తోటి సిబ్బంది అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు సమాచారం. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

బాల్య వివాహం చేసుకున్న నిందితుడి రిమాండ్

రామారెడ్డి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అక్టోబరు 16వ తేదిన సాకలి గల్లిలో జరిగిన బాల్య వివాహం జరిగింది. 16 సంవత్సరాల బాలిక ఉన్న నేపథ్యంలో సీడబ్ల్యూసీ బాల్య వివాహం కింద బాలికను రెస్క్యూ హోమ్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్‌రావు, కామారెడ్డి రూరల్ సీఐ రమణ నేతృత్వంలో విచారణ నిర్వహించారు. బాల్య వివాహం చేసుకున్న ఐలాపురం శ్రీధర్‌పై సోమవారం నిర్భయ చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు చేసినట్లు ఎస్ఐ నరేష్ వివరించారు.

చెరువుల్లో చేప పిల్లల విడుదల

భీమ్‌గల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాగులకుంట చెరువులో మత్స్యశాఖ ఏడీ ఆంజనేయస్వామి ఆధ్వర్యంలో సోమవారం చేప పిల్లలను వదిలారు. ప్రభుత్వం గంగపుత్రులకు ఉపాధి కల్పించేందుకు వంద శాతం సబ్సిడి చేప పిల్ల విత్తనాలను అందజేస్తూ ప్రోత్సహిస్తుందని కనుక ప్రతి సభ్యుడు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఏడీ ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహమ్మద్‌షబ్బీర్, మత్స్యశాఖ ఫీల్డ్ ఆఫీసర్ నగేష్, మండల కాంగ్రెస్ నాయకులు జెజె.నర్సయ్య, కుంట రమేష్, గోపాల్‌నాయక్, పర్స అనంత రావు, కన్నె సురేందర్, తోట సతీష్ ఉన్నారు.

ఘనంగా భీమన్న పండుగ ఉత్సవాలు

నవీపేట, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం భీమన్న పండుగను ఘనంగా నిర్వహించారు. ఆదివాసి నాయక్‌పోడ్‌ల ఆరాధ్య దైవం భీమన్న పండుగను ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ

కోటగిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సోమవారం జీఈసీవో భాగ్యలక్ష్మి తనిఖీ చేశారు. పాఠశాలలో పలు రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించడంతో పాటు వంటగది, స్టాక్ రిజిష్టర్‌లను పరిశీలించారు.



ఫోకస్

పురాణిపేట్ శివారులో అక్రమ లేఅవుట్లు!

- గ్రామాల్లో రియల్ ఎస్టేట్ అక్రమ వ్యాపారం
- పురాణిపేట్ గ్రామ శివారులో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అక్రమ వెంచర్లు
- నిబంధనలను తూట్లు పొడుస్తూ 10శాతం భూమి వదలకుండా ప్లాట్ల విక్రయాలు
- వ్యవసాయ భూములు కొనుగోలు చేసి గజాల చొప్పున విక్రయాలు
- మామూళ్ల మత్తులో పడి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న కొందరు అధికారులు

భీమ్‌గల్ రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు అక్రమ వెంచర్లు వేస్తున్నారు. కల్లిబొల్లి మాటలు చెప్తూ అమాయకులకు ప్లాట్లను అంటగడుతూ కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు. తాజాగా భీమ్‌గల్ మండలంలోని పురాణిపేట్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న 56 సర్వే నెంబర్‌లో ఇటీవల కొందరు రియల్ ఏస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎలాంటి అనుమతులు లేకుండా వ్యవసాయ భూమిని చదును చేసి ఆ భూమిలో వెంచర్ వేసి ప్లాట్ల విక్రయాలు జరుపుతున్నారని సమాచారం. భీమ్‌గల్ మున్సిపల్‌కు ఆనుకొని ఉన్న ఈ గ్రామంలో భూములకు మంచి డిమాండ్ ఉంది. రానురాను ఈ గ్రామాన్ని భీమ్‌గల్ మున్సిపల్‌లో కలుపుతారని రియల్‌ఎస్టేట్ వ్యాపారులు అక్కడ భారీ మొత్తంలో పెట్టుబడులు పెట్టి అక్రమంగా వెంచర్లు వేస్తున్నారు. వ్యవసాయ భూములకు గుంటల రూపంలో కొనుగోలుచేసి గజాల చొప్పున విక్రయాలు జరుపుతున్నారు. అక్రమ వెంచర్‌లపై చర్యలు తీసుకోవాల్సిన గ్రామపంచాయతీ అధికారులు మామూళ్ల మత్తులో పడి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి గ్రామపంచాయతీకి రావాల్సిన పది శాతం భూమిని రియల్ వ్యాపారులు మింగేస్తున్నారు. నిబంధనల ప్రకారం నాలా కన్వర్షన్ డీటీసీపీ అనుమతి లేకుండా విక్రయాలు జరపవద్దు. నాలా (నాన్ అగ్రికల్చర్ ల్యాండ్స్ అసిస్టెంట్ యాక్టు) చట్టం -2006 ప్రకారం కన్వర్షన్ చేయకుండా వ్యవసాయ భూములను వ్యవసాయేతర అవసరాలకు వినియోగించరాదని నిబంధన ఉన్నప్పటికీ ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదు. నాలా చట్టాన్ని అనుసరించి వ్యవసాయ భూములను వ్యవసాయేతర పనులకు ఉపయోగిస్తే ఏకమొత్తంలో ఒకేసారి కన్వర్షన్ చార్జీలను భూమి విలువపై మూడు శాతం ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. కన్వర్షన్ అనంతరం భూమిని ప్లాట్లుగా మార్చి విక్రయించాలంటే డీటీసీపీ (డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్) అనుమతి తప్పనిసరి. ఒక ఎకరం 40గుంటల స్థలంలో డీటీసీపీ అనుమతికి వెళ్లే 12 శాతం ఓపెన్ స్థలం (తొమ్మిది శాతం గ్రీనరి ఒక శాతం వాటర్ ట్యాంకు సెప్టిక్ ట్యాంకులు ఒక శాతం వాణిజ్య అవసరాలు ఒక శాతం హెల్త్ సెంటర్ పాఠశాల) కోసం స్థలం కేటాయించాల్సి ఉంటుంది. కానీ దీనికి పూర్తి విరుద్ధంగా రియల్‌ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా వెంచర్లు వేసి ప్లాట్లను అమాయకులకు విక్రయించి కోట్ల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ధరణి పోర్టల్‌లో ఉన్న లోపాలను అసరాగా తీసుకొని తప్పుడు డ్యాక్యుమెంట్‌లు సృష్టిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఒక సర్వే నెంబర్ ఉంటే దానికి వందల సంఖ్యలో బై నెంబర్‌లు వేసి రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి అక్రమ వెంచర్‌ను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

- జితేందర్, పంచాయతీ కార్యదర్శి, పురాణిపేట్



పురాణిపేట్‌లోని సర్వేనెంబర్ 56లో గ్రామపంచాయతీ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా వేసిన వెంచర్ యాజమానికి నోటీసులు జారీచేశాం. తక్షణమే పనులు ఆపాలని అక్కడ ఉన్న హద్దు రాళ్లను తీసివేయాలని ఆదేశించాం. ఆ వెంచర్‌లో ఎవరు కూడా ప్లాట్లను కొనవద్దు. అక్రమంగా వెంచర్లు వేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

డీటీసీపీ అనుమతి లేకుండా ప్లాట్లను అమ్మొద్దు

- ఇక్బాల్ హైమద్, సబ్‌రిజిస్ట్రర్, భీమ్‌గల్



నిబంధనల ప్రకారం డీటీసీపీ అనుమతి లేకుండా ప్లాట్లను విక్రయించొద్దు. ఇప్పటివరకు 56 సర్వేనెంబర్‌లో డ్యాకుమెంట్స్ చేయలేదు. ప్రజలు ప్లాట్లను కొనేటప్పుడు వెంచర్‌కు అన్ని అనుమతులు ఉన్నాయా లేదా చూసుకోవాలి. డాక్యుమెంట్ రైటర్స్ తప్పుడు ధృవపత్రాలతో అధికారులను తప్పుదోవ పట్టిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. ప్లాట్లు కొనేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

జర దేఖో!!



మహ్మద్‌నగర్ మండల కేంద్రంలో పురాతన అతిథి గృహం ఇదే..

మహ్మద్‌నగర్ మండలంలో సమీకృత కార్యాలయాల నిర్మాణం ఎప్పుడో?

- ఇరిగేషన్ అతిథి గృహం వద్ద అనుకూలంగా ఉన్న భూమి
- ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్ పాలన వ్యవహారం మహ్మద్‌నగర్‌లో లేనట్లేనా?

నిజాంసాగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏర్పాటైనఅయిన మహ్మద్‌నగర్ మండలంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం ఇంకెప్పుడని మండల వాసులు ప్రశ్నిస్తున్నారు. గత ఏడాది మహ్మద్‌నగర్‌లో టీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో మండలాన్ని ఏర్పాటుచేశారు. కానీ ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్, ఉపాధిహామీ, ఐకేపీ పాలన ఉమ్మడి నిజాంసాగర్ నుంచి అధికార యంత్రాంగం కొనసాగిస్తూ ఉన్నారు. ఇటీవల కాలంలో విద్యాశాఖను నిజాంసాగర్ నుంచి విడదీశారు. మహ్మద్‌నగర్ మండల శాఖ విద్యా శాఖ అధికారిని నియమించారు. కానీ విద్యా శాఖ పాలన వ్యవహారం నిజాంసాగర్ విద్యా వనరుల కార్యాలయం నుంచి విద్యాశాఖ అధికారి కొనసాగిస్తూ ఉన్నారు. ఇప్పటికీ ఎంపీడీవో, ఐకేపీ, పోలీస్‌స్టేషన్, ట్రాన్స్‌కో పాలన నిజాంసాగర్ నుంచి కొనసాగుతూ ఉండటంతో మండల పరిధిలోని గ్రామాల ప్రజలు అనేక పాట్లు పడుతూనే ఉన్నారు. పేరుకే మహ్మద్ నగర్ మండలం ఏర్పాటు చేశారు. ఇక్కడ కేవలం తహసీల్దార్ కార్యాలయ నిర్వహణ కొనసాగుతూనే ఉంది. ఈ కార్యాలయం అప్పట్లో నిర్మాణం చేపట్టిన గ్రామ పంచాయతీ భవనాన్ని తహసీల్దార్ కార్యాలయానికి కేటాయించి అధికార యంత్రాంగం విధులు నిర్వహిస్తూనే ఉన్నారు. మహ్మద్‌నగర్ మండలంలో సమీకృత కార్యాలయాలు ఎన్నడూ ఏర్పాటు అవుతాయని ప్రజలు ప్రశ్నిస్తూ ఉన్నారు. మహ్మద్‌నగర్‌లో పోలీస్‌స్టేషన్‌ను పురాతన నీటి పారుదల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేయనున్నారని అధికార పార్టీ నాయకులు ప్రచారం చేశారు. కానీ మహ్మద్‌నగర్ మండలంలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు ఊసే లేకుండాపోయింది. నీటి పారుదల శాఖ అతిథిగృహం వద్ద దాదాపురెండు ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ ఈ భూమిలోనే మహ్మద్‌నగర్ మండల సమీకృత కార్యాలయాల భవనాలు నిర్మాణానికి కార్యచరణ రూపొందించేనా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే మండలంలో ఎంపీడీవో, ఐకేపీ, ట్రాన్స్‌కో, పోలీస్‌స్టేషన్ నిర్వహణ ఉమ్మడి నిజాంసాగర్ నుండే అధికార యంత్రాంగం కొనసాగిస్తూ ఉన్నారు. అధికార యంత్రాంగం మహ్మద్‌నగర్ మండల కేంద్రంలో ఈ కార్యాలయాల పాలన కొనసాగేనని మండల వాసులు వాపోతున్నారు. మహ్మద్‌నగర్ మండల కేంద్రంలో ప్రభుత్వం మరో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ ఆ వైపుగా చర్యలు చేపట్టడం లేదు. కొమలంచ మహ్మద్‌నగర్ గ్రామాల్లో పల్లె దవాఖానాలను ఏర్పాటు చేసింది. నిజాంసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి మహబూబ్‌నగర్ మండల ప్రజాఆరోగ్య పరిపాలన నిజాంసాగర్ వైద్యాధికారులే కొనసాగిస్తున్నారు. మహ్మద్‌నగర్ మండలకేంద్రంలో ప్రజా పాలన సాధ్యమయ్యేలా మండలవాసులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి ప్రజాపాలన కార్యాలయాల తోపాటు సమీకృత ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించాలని మండలవాసులు కోరుతున్నారు.



మండల కేంద్రంలో కార్యాలయ నిర్మాణాలకు అనువుగా ఉన్న ప్రభుత్వ భూమి

ఆంధ్రజ్యోతి పరిశీలన



- డబుల్ బెడ్ రూమ్‌ల కోసం శంకుస్థాపన చేసిన శిలాఫలకం

పశువుల పాకగా.. డబుల్ ఇళ్లు!

- ఏడేళ్లుగా పూర్తి కాని డబుల్ బెడ్‌రూమ్ నిర్మాణ పనులు
- పనులు పూర్తి చేయడంలో అధికారుల నిర్లక్ష్యం
- పేదలకు కలగానే మిగిలిన సొంతిల్లు

> నాగిరెడ్డిపేట మండల కేంద్రానికి మంజూరైన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు చివరికి పశువులకు పాకగా మారాయి. ఇళ్ల నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోగా.. ఏళ్లు గడిచినా పూర్తికాలేదు. అసంపూర్తిగా దర్శనమిస్తున్న ఈ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పశువుల కొట్టాలుగా మారాయి. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం స్లాబ్ లెవల్‌లో పనులు ఆగి చాలాకాలంగా ఖాళీగా ఉండిపోయాయి. దీంతో కొందరు తమ పశువులను కట్టేసుకుంటున్నారు.

నాగిరెడ్డిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్‌ఎస్ హయాంలో మంజూరైన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలు ఏళ్లు గడిచినా పూర్తి కావడంలేదు. గత ప్రభుత్వం సొంతిల్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు పథకాన్ని ప్రారంభించింది. దీనిలో భాగంగానే ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని నాగిరెడ్డిపేట మండలానికి 2017లో 100 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరయ్యాయి. మండల కేంద్రానికి 50 ఇళ్లు, మండలంలోని పోచారం గ్రామానికి 50 ఇళ్ల చొప్పున మంజూరయ్యాయి. ప్రభుత్వం నిర్లక్ష్యం, కాంట్రాక్టర్‌ల నిర్లక్ష్యం తదితర కారణాల వల్ల మండలంలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలు ఇప్పటికీ పూర్తి కాలేదు. ఫలితంగా సొంత ఇళ్ల కోసం ఎదురు చూసిన ఇళ్లు లేని నిరుపేదల ఆశలు నిరాశగానే మిగిలాయి. వారు కన్న కలలు కలలుగానే మిగిలాయి.

ఏడేళ్లుగా పూర్తికాని నిర్మాణాలు

నాగిరెడ్డిపేట మండలంలో మంజూరైన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలు ఏడేళ్లుగా పూర్తి కావడంలేదు. మండలానికి 2017లో 100 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరయ్యాయి. మండల కేంద్రానికి 50 ఇళ్లు, మండలంలోని పోచారం గ్రామానికి 50 ఇళ్ల చొప్పున మంజూరయ్యాయి. మండల కేంద్రానికి రూ.2.52 కోట్ల వ్యయంతో మంజూరైన 50 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి అప్పటి ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి 2 డిసెంబర్ 2017లో శంకుస్థాపన చేశారు. నిర్మాణం పనులు మొదట్లో సాగిన కొంతవరకు పనులు జరిగి అర్ధాంతరంగా నిలిచిపోయాయి. కొన్ని ఇళ్లు స్లాబ్ లెవల్‌లో నిలిచిపోగా, మరికొన్ని ఇండ్లు బేస్మెట్ లెవల్ లోనే అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పోచారం గ్రామానికి మంజూరైన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలు పునాదుల వద్దే నిలిచిపోయాయి. డబుల్ బెడ్‌రూమ్‌ల ఇళ్లు నిర్మాణాలు నిలిచిపోయి సంవత్సరాలు గడుస్తున్నా వీటిని పూర్తి చేయడంలో ప్రభుత్వం గాని, అధికారులు గాని, నాయకులు గాని ఎవరూ ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు తగు చర్యలు తీసుకుని అసంపూర్తిగా నిలిచిపోయి ఇండ్ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

పశువులకు, మేకలకు కొట్టం

మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పశువులకు, మేకలు ఉండేందుకు పశువుల కొట్టాలుగా మారాయి. డబుల్ బెడ్ రూమ్‌ల నిర్మాణం పనులు ఏళ్ళ తరబడి నిలిచిపోవడంతో, అవి చాలా కాలంగా ఖాళీగా దర్శనమిస్తుండటంతో కొందరు తమ పశువులను, మేకలను అందులో కట్టేసుకుంటున్నారు. హైదరాబాద్-బోధన్ ప్రధాన రహదారి పక్కనే మండల కేంద్రంలో ఈ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. సుమారు ఏడేళ్లుగా నిర్మాణాలు పూర్తిగాక అవి అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఇళ్ల నిర్మాణాలు పూర్తయితే అందులో ప్రజలు నివాసం ఉండాల్సి ఉండగా, నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో వాటిలో ప్రస్తుతం పశువులు, మేకలు దర్శనమిస్తున్నాయి.

మద్యం ప్రియులకు అడ్డా !

మండల కేంద్రంలోని అసంపూర్తి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మద్యం ప్రియులకు అడ్డాగామారింది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చే మద్యం ప్రియులు ఈ డబుల్ బెడ్‌రూమ్‌ల వద్ద మద్యాన్ని సేవిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, నాయకులు తగు చర్యలు తీసుకుని వీటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



పోచారంలో పునాదుల వద్దే నిలిచిన పనులు



నాగిరెడ్డిపేటలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్‌లలో పశువులను కట్టేసిన దృశ్యం



నాగిరెడ్డిపేటలో స్లాబ్ వద్ద ఆగిన నిర్మాణ పనులు

ఎమ్మెల్సీ ఎన్నికలపై గురి!

(5వ పేజీ తరువాయి...)

వివిధ ఉద్యోగాలు వచ్చి ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, నిరుద్యోగులు నేరుగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవడానికి ముందుకు రావడం లేదు. మరో వైపు ఓటు నమోదు కోసం అధికార యంత్రాంగం అవగాహన కల్పించకపోవడం, ప్రచారం చేయకపోవడంతో నమోదుకు ముందుకు రావడం లేదని తెలుస్తుంది. జిల్లాలో గత 2019లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో 4,595 మంది పట్టభద్రులు, 504 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పొగమంచుతో వాహనదారులకు ఇబ్బందులు



పొగమంచులో ప్రయాణిస్తున్న వాహనం

పెద్ద కొడప్‌గల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెద్ద కొడప్‌గల్ మండలంలో సోమవారం ఉదయం భారీగా పొగమంచు కురియడంతో 161వ జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఉదయం 6 గంటల నుంచే పొగమంచు కురియడంతో ముందుకు వెళ్తున్న వాహనాలు కనబడక నిదానంగా ప్రయాణం సాగించారు. ఉదయం 8 గంటల వరకు పొగమంచు కురియడంతో వాహన దారులు తమ రాకపోకలు నిదానంగా సాగించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఉదయం వ్యవసాయ పనుల కోసం వెళ్లాల్సిన వారు తమ పనులను ఎండ కాచేంత వరకు వాయిదా వేసుకున్నారు.

లింగంపల్లి హత్య కేసును ఛేదించిన పోలీసులు

సదాశివనగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపల్లి గ్రామ శివారులో గతనెల 31వ తేదీన జరిగిన హత్య కేసును సదాశివనగర్ పోలీసులు ఛేదించారు. సోమవారం ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మృతిచెందిన వ్యక్తి ఎవరనేది తెలియకపోవడంతో మీడియా,సోషల్‌మీడియా ద్వారా ప్రచారం చేయడంతో మృతుని భార్య లావణ్య ఒకటవ తేదిన సదాశివనగర్ స్టేషన్‌కు వచ్చి తన భర్త కృష్ణ గంగాధర్ అనే వ్యక్తిని కలవడానికి వెళ్తున్నట్లు తెలిపాడని పోలీసులకు తెలిపింది. దీంతో ఆ దిశగా సీఐ సంతోష్, ఎస్‌ఐ రంజిత్‌లు విచారణ కొనసాగించగా లింగంపేట మండలం కోర్పల్ గ్రామానికిచెందిన గంగాధర్ అతని భార్య లావణ్య బతుకుదెరువుకోసం అర్గుల్ గ్రామంలో పనిచేస్తున్నప్పుడు మృతుడు కృష్ణ పరిచయమైయడని తెలిపారు. 2019 సంవత్సరంలో ఆర్గుల్ నుంచి తిరిగివచ్చి గంగాధర్ దుబాయికి వెళ్లి తిరిగి వచ్చాడు. మళ్లి దుబాయ్‌కు వెళ్లెందుకు డబ్బులు అవసరం కావడంతో ధర్మారంలోని కృష్ణవద్దకు వెళ్లి నాలుగు తులాల బంగారం అడిగి దానికి మిత్తి తులానికి తులంనర చొప్పున మొత్తం 6 తులాల బంగారం కొనిస్తానని తెలిపాడు. కృష్ణను చంపివేస్తే తిరిగి బంగారంకాని డబ్బు కాని ఇవ్వాల్సిన అవసరం లేదనే ఆలోచనతో కృష్ణను కామారెడ్డికి రప్పించి నిజాంసాగర్ చౌరస్తా వద్దగల కల్లుదుకాణంలోకల్లుతాగించి కృష్ణకు మత్తువచ్చే విధంగా చేసి తాడ్వాయి మీదుగా లింగంపల్లి శివారు ప్రాంతానికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. లింగంపల్లి శివారులోని డంపింగ్‌యార్డు వద్ద గంగాధర్ కృష్ణను మూత్రం చేస్తుండగా తలపై రాయితో గట్టిగా రెండుసార్లు కొట్టడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే చనిపోయాడని తెలిపారు. కృష్ణ వద్దనున్న ఫోన్‌ను గంగాధర్ తీసుకొని అందులో ఉన్న రూ.40 వేలను తన అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేసుకుని దుబాయ్ పారిపోదామన్న ఆలోచనలో గంగాధర్ ఉండగా పోలీసులు గంగాధర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్ద పల్సర్‌బైక్‌తో పాటు రూ.40 వేలను, పాస్‌పోర్టు, మృతుడు కృష్ణ ఫోన్‌ను, గంగాధర్ హెల్మెట్‌లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. హత్యకేసు ఛేదించిన సీఐ,ఎస్‌లతో పాటు క్రైమ్‌పార్టీకి చెందిన రవి, శ్రీనివాస్, వెంకట్‌రాములు, సాయిబాబా, యాదగిరిలను ఎస్పీ సింధూశర్మ అభినందించి క్యాష్ రివార్డు ప్రశంసపత్రం మంజూరు చేస్తానని తెలపడం జరిగిందని డీఎస్పీ తెలిపారు.

వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం

రాజంపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్గొండ ప్రాథమిక వ్యవసాయసహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం గుడితండా, ఎల్లారెడ్డిపల్లి తండా, షేర్ శంకర్‌తండా గ్రామాలలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఛైర్మన్ కంది శివరాములు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలుకేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని దళారులను నమ్మిమోసపోవద్దని తెలిపారు.ఈ కార్యక్రమంలో సదాశివనగర్ మార్కెట్ కమిటి ఛైర్మన్ సంధ్యానాయక్, వైస్ ఛైర్మన్ జక్కుల రాజిరెడ్డి, డైరెక్టర్‌లు చిన్నసాయిలు, ఏఈవో రజిత పాల్గొన్నారు.

జీఎస్ఆర్ ఫ్యాక్టరీ క్రషింగ్ ప్రారంభం

- ఏడాది నాలుగు లక్షల మెట్రిక్ టన్నులు చెరుకు క్రషింగ్‌కు లక్ష్యం

నిజాంసాగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ మండలం మాగీ శివారులో ఉన్న జీఎస్ఆర్ ఫ్యాక్టరీ చెరుకు క్రషింగ్ సోమవారం ఫ్యాక్టరీ అధికార యంత్రాంగం ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఏడాది 14 వేల ఎకరాల్లో చెరకు సాగాయి ఉందని జీఎస్ఆర్ ఫ్యాక్టరీ నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల చెరుకును క్రషింగ్ చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని ఫ్యాక్టరీ వైస్ ఛైర్మన్ వేణుగోపాలరావు తెలిపారు. ఫ్యాక్టరీ పరిధిలో చెరుకు సాగు చేసిన రైతులు సకాలంలో ఫ్యాక్టరీకి చెరకు తరలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీసీ ఛైర్మన్ షాదుల్లా, జనరల్ మేనేజర్ క్రేన్ వెంగల్‌రెడ్డి ఉన్నారు.

సాందీపని డిగ్రీ కళాశాలలో క్విజ్ పోటీలు

కామారెడ్డి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణంలోని సాందీపని డిగ్రీకళాశాలలో యూనివర్సిటి లెవల్ (మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్) క్విజ్ పోటీలను సోమవారం నిర్వహించారు. విద్యార్థుల కోసం సెలక్షన్ ప్రాసెస్ నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాలకు చెందిన 70 మంది విద్యార్థిని, విద్యార్థులు పోటిలో పాల్గొన్నారు. వీరిలో ముగ్గురు విద్యార్థులు యూనివర్సిటి స్థాయి పోటిలకు ఎంపికయ్యారు.



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

శివాలయాలకు భక్తుల తాకిడి



కామారెడ్డిటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం తోలి సోమవారం కావడంతో కామారెడ్డి పట్టణంలోని ఆయా శివాలయాలు భక్తులు కిటకిటలాడాయి. ఆలయాల్లో పండితులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. మహిళలు శివాలయాల్లో దీపారాధన, శివలింగాలకు పూజలు నిర్వహించారు.

శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

రామారెడ్డి: మండలంలోని మద్దికుంట గ్రామ అడవి ప్రాంతంలో వెల సిన శ్రీ స్వయంభూ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రాష్ట్ర ఆగ్రోస్ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ మారా గంగారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ మారా గంగారెడ్డి తెలంగాణ రాష్ట్ర రైతాంగం సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నారెడ్డి మోహన్ రెడ్డి, గీరెడ్డి మహేందర్ రెడ్డి, నారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జడ్పీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గీరెడ్డి మహేందర్ రెడ్డి, మండల నాయకులు నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సీనియర్ నాయకులు రాజు, శ్రీనివాస్, అనీఫ్, మహ్మద్ పాల్గొ న్నారు.

భక్తులతో కిక్కిరిసిన శ్రీ సిద్ధరామేశ్వర ఆలయంలో..

భిక్కనూరు: మండలకేంద్రం లోని దక్షిణ కాశీగా బాసిల్లుతున్న శ్రీ సిద్ధరామేశ్వర ఆలయం కార్తీక మాస సోమవారం సందర్భంగా కిక్కిరిసిపోయింది. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్తీక మాస ఉత్సవాల్లో భా గంగా ఆలయ అర్చకులు స్వామివారికి తీరొక్క పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి కల్యాణం, సా మూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు.

లింగంపేట రామేశ్వర ఆలయంలో..

లింగంపేట: మండల కేంద్రంలోని రామేశ్వర ఆలయంలో సోమవారం భక్తులు సహస్ర కార్తిక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్తిక మాసం సందర్భంగా ఆలయంలో వేద బ్రాహ్మణులు పూజలు చేశారు.



కామారెడ్డి శివాలయంలో..



బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మార గంగారెడ్డి



శ్రీ సిద్ధరామేశ్వర ఆలయంలో స్వామివారి కల్యాణం

రాష్ట్రంలోనే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతా

- గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి

భిక్కనూరు, నవంబరు 4: రాష్ట్రంలోనే కామారెడ్డి జిల్లాలోని అన్ని గ్రంథాలయాలను ప్రభుత్వ, దాతల సహకారంతో రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతానని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం భిక్కనూరు మండలకేంద్రంలోని గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతీ గ్రంథాలయంలో అవసరమైన మేరు స్టడీ మెటిరియల్‌ను అందుబాటులో ఉంచే విధంగా కృషిచేస్తానన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా దాతలు ముందుకురావాలని కోరారు. అనంతరం యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇలీయాస్ మాట్లాడుతూ ప్రతీ గ్రంథాలయానికి రూ.10వేలు అందించడంతో పాటుగా ప్రతీ గ్రంథాలయంలో సొంతంగా ఇంటర్నెట్ సౌకర్యంతో పాటుగా వైఫై సౌకర్యం కల్పిస్తానన్నారు. ప్రతీ గ్రంథాలయంలో మరుగుదొడ్లు, మౌళిక వసతులకు షబ్బీర్ ఫౌండేషన్ ద్వారా నిధులు సమకూర్చుతామ న్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఇంద్ర కరణ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బీంరెడ్డి, గ్రంథాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.



భిక్కనూరు గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి

జనవరి నుంచి రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ

జనవరి నుంచి రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేయ్యడం జరుగుతుందని గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇలీయాస్ అన్నారు. సోమవారం భిక్కనూరు మండలంలోని కాచాపూర్, బాగిర్తిపల్లి గ్రామాల్లో నూతన రేషన్ దుకాణాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని, పేదోడి ఆకలి తీర్చడానికి ఎంత ఖర్చు అయిన వెనుకాడకుండా సన్న బియ్యం పంపిణీకి చర్యలు తీసుకుంటుందన్నారు. త్వరలోనే ప్రతిఒక్కరికి రేషన్ కార్డులను అందజేయ్యడం జరుగుతుందని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేకు ప్రతీఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఇంద్ర కరణ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాజు, వైస్ చైర్మన్ స్వామి, నాయకులు కిష్టాగౌడ్, తోగరి సుదర్శన్, బైండ్ల దశరథం, శ్రీనివాస్, సంతోష్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలు దేవాలయాలతో సమానం

దోమకొండ: గ్రంథాలయాలు దేవాలయాలతో సమానమని జిల్లా గ్రంథాలయశాఖ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం దోమకొండ, బీబీపేట మండలాల్లోని గ్రంథాలయాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి అన్ని రకాల పుస్తకాలను అన్ని గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచుతానని అన్నారు. యువతి, యువకులు కష్టపడి చదివి మంచి ఉద్యోగాలను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ అధ్యక్షులు ఇలియాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజు, మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ కదిరె గోపాల్‌రెడ్డి, నర్సయ్య, మండలాధ్యక్షుడు అనంత్‌రెడ్డి, అబ్రబోయిన స్వామి, తాటిపల్లి, శ్రీకాంత్,అండెం శంకర్‌రెడ్డి, మట్ట శ్రీనివాస్, మదుసుధన్‌రెడ్డి,నర్సారెడ్డి, పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు, ప్రసాద్, పల్లె రామస్వామిగౌడ్, నల్లపు శ్రీనివాస్, సిద్దరెడ్డి, బీంరెడ్డి, నాగేంద్రవర్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రేషన్ దుకాణం ప్రారంభం

మాచారెడ్డి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండలం ఎల్పుగొండ గ్రామంలో ప్రభుత్వ రేషన్‌దుకాణంను తహసీల్దార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఇలియాస్ పాల్గొని మాట్లాడారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఉచిత బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టి వారిని ఆదుకోవాలని తెలిపారు. వచ్చేనెల నుంచి చౌకధర దుకాణాలలో పేదలకు సన్నబియ్యం కాంగ్రెస్ అందిస్తుందన్నారు.



రేషన్‌బియ్యం అందిస్తున్న తహసీల్దార్

ఘనంగా డాక్టర్ బాపురెడ్డి సంతాప సభ

బాన్సువాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బాన్సు వాడ ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నాయకులు బాన్సువాడ నియోజక వర్గం బీఆర్‌ఎస్ పార్టీ మాజీ ఇంచార్జి డాక్టర్ జె.బాపూరెడ్డి ఇటీవల మరణించిన సందర్భంగా సోమవారం తెలంగాణ మలిదశ ఉద్యమకారులు అభిమానులు నాయకులు ఆయనను స్మరించుకుంటూ ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సంతాపసభలో ఉద్యమకారులు, ఉద్యమకారులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్య మంలో టీఆర్‌ఎస్ పార్టీని బలోపేతం చేసి తెలంగాణ ఉద్యమానికి ఎంతో తోడ్పాటు అందించి కార్యకర్తలకు, ఉద్యమకారులకు బాసటగా నిలిచారని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, ఉద్యమకారులు గుర్తు చేసుకున్నారని, తెలంగాణ మలి దశ ఉద్యమకారుల ఫోరమ్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుల ఫోరమ్ నాయకులు కొత్తకొండ భాస్కర్, డాక్టర్ బాబుసింధే, మజీద్, మాధవ్ యాదవ్, స్వరూప, శ్యామ్, ఉడత గంగాధర్, ఎర్రవటి సాయిబాబా, చందు, మన్నె చిన్న సాయిలు, కృష్ణ, మారుతి, మహేష్, భీమ్ సింగ్, రాజు పాల్గొన్నారు.



బాన్సువాడలో డాక్టర్ బాపూరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉద్యమకారులు

పెండింగ్ బిల్లులు విడుదల చేయండి

- డిప్యూటీ సీఎం భట్టితో ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

ఎల్లారెడ్డి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు సోమవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఉన్న వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం పెండింగ్ బిల్లులను త్వరగా విడుదల చేయాలని వినతిపత్రాన్ని అందజేశారు. అదే విధంగా నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయాలని, స్కూల్ ఏర్పాటుకు, నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని లింగంపేట మండలంలోని మోతే గ్రామంలో సిద్ధం చేశామని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



డిప్యూటీ సీఎంకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్

పెద్దకొడప్‌గల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని మాజీ సర్పంచులు తలపెట్టిన సచివాలయ ముట్టడికి వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. సోమవారం మాజీ సర్పంచులు తమ బిల్లుల కోసం సచివాలయ ముట్టడికి వెళ్తారనే పోలీసులకు సమాచారం అందడంతో మాజీ సర్పంచులను ముందస్తు అరెస్ట్ చేశారు. పెద్ద కొడప్‌గల్, జుక్కల్ మండలాల మాజీ సర్పంచ్‌లను పోలీసులు తమ అదుపులోకి తీసుకున్నారు.



మాజీ సర్పంచ్‌లను అరెస్ట్ చేసిన పోలీసులు

లింగంపేట: లింగంపేటలో ముందస్తు అరెస్టైనవారిలో మాజిసర్పంచ్‌లు ధనలక్ష్మి శ్రీనివాస్‌రెడ్డి, బండి కవితనర్సింలు, బొల్లు లావణ్యలు ఉన్నారు.

ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలను తనిఖీ చేసిన ప్రభుత్వ సలహాదారు పోచారం

- పోచారానికి అతిథి అధ్యాపకుల సమస్యలపై వినతి



బాన్సువాడ ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కళాశాలలో చర్చిస్తున్న పోచారం

బాన్సువాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దేశాయిపేట గ్రామంలోని ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సోమవారం వ్యవసాయ ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. కళాశాలలో నెలకొన్న సమస్యలను అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను కళాశాల ప్రాంతాన్ని పరిశీలించారు. విద్యార్థుల పట్ల అశ్రద్ధ వహించవద్దని ప్రతీ ఒక్క అధ్యాపకుడు ఉత్తమమైన బోధన చేపట్టాలని సమయపాలన పాటించాలని అధ్యాపకులకు సూచించారు. అనంతరం డిగ్రీ కాళాలలో విధులు నిర్వహిస్తున్న అతిథి అధ్యాపకులకు కనీస వేతనం చెల్లించాలని పోచారం శ్రీనివాస్‌రెడ్డికి అధ్యాపకులు వినతిపత్రం ఇచ్చారు. ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం అమలు చేయాలని కోరారు. అవర్లీ బేస్డ్ వల్ల సెలవుల్లో, పరీక్షల సమయంలో తీవ్రంగా నష్టపోతున్నామని అన్నారు. సానుకూలంగా స్పందించిన పోచారం త్వరలోనే అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, వినోషన్, భీమయ్య, మనోహర్, అనిల్, మోహన్, సిద్ద లక్ష్మీ, రమేష్, లాయక్ ఉన్నారు.

మన్మథ స్వామి ఆలయానికి పాదయాత్ర



మద్నూర్ నుంచి బయలుదేరిన పాదయాత్ర భక్తులు

మద్నూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రం నుంచి శివానంద్ శివాచార్య మహారాజ్ ఆధ్వర్యంలో భక్తులు మన్మథ స్వామికి పాదయాత్రతో బయలుదేరి వెళ్లారు. వారికి అడుగడుగునా భక్తులు స్వాగతం పలికారు. మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో ఉన్న మన్మధ స్వామి మద్నూర్ నుంచి 300 కలో మీటర్ల దూరంలో ఉంటుంది. అక్కడి వరకు భక్తులు పాదయాత్రతో భజన, కీర్తనలు చేసుకుంటూ పూర్ణిమ రోజు మన్మధ స్వామికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని భక్తులు వెల్లడించారు. ప్రతీ సంవత్సరం అనవాయితీగా మద్నూర్ బాదన్నమఠం నుంచి శివానంద శివాచార్య మహాఆరాజా ఆధ్వర్యంలో మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక, భక్తులతో కలిసి పాదయాత్రతో వెళుతుంటారు.

ఉచిత చేపల పంపిణీ

లింగంపేట, నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లోని చెరువుల్లో చేపపిల్లలను వేయడానికి ఉచితంగా చేప పిల్లలను మత్స్య శాఖ జిల్లా అధ్యక్షుడు సాయిలు పంపిణీ చేశారు. మండలంలోని 15సొసైటీల పరిధిలో 63 చెరువులకు గాను 8 లక్షల 50 వేల చేప పిల్లలను పంపిణీ చేశారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి - లక్కీ భాస్కర్
దర్శన్ - సింగం ఆగేన్
ప్రియా 35 - అమరన్
ప్రియా 70 - క

బాన్సువాడ

మహేశ్వరి - లక్కీ భాస్కర్
వెంకటేశ్వర - అమరన్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

